RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే
దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 187
ఆదివారం, జూన్ 21, 2026, పేజీలు - 4 వెల : 2/-




### నీట్ అభ్యర్థులు ఒత్తిడికి లోనుకాకుండా
# పరీక్ష రాయాలి
## : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 20, : నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయా లని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం..దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని తెలిపారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

### 27 లక్షల మంది విద్యార్థులకు విజయ
# పాలు అందిస్తాం
## : భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూన్ 20, : పాడి రైతుకు భరోసా కల్పిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విజయ డెయిరీకి ప్రభుత్వ అండగా ఉంటుందని మాటి చ్చారు. 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు అందించేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు. ఈరోజు (శనివారం) సచివా లయంలో పాల సేకరణ, వినియోగంపై భట్టివిక్రమార్క ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిం చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిపై సమగ్ర నివేదిక కోరారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టివిక్రమార్క మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు విజయ డెయిరీ పాలు అందజేస్తామని చెప్పుకొచ్చారు. పాడి రైతులకు బకాయిలు లేకుండా చెల్లింపులు చేస్తామని తెలిపారు. రైతులకు సమయానికి బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు.గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాడి పరిశ్రమే వెన్నెముక..పాలిచ్చే పశువుల అసలు సంఖ్య గుర్తించాలని అధికారులకు మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

### వానాకాలంలో బేఫికర్.. హైదరాబాద్‌లో వరద ముప్పు నివారణకు
# హైడ్రా 24/7 యాక్షన్ ప్లాన్..




మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వానాకాలంలో హైదరాబాద్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హైడ్రా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. జలవిహార్‌లో ఏర్పాటు చేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌ల ప్రత్యేక సమావేశంలో పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో హైదరాబాద్‌లో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.వర్షాకాలం ప్రారంభమవుతోంది. చిన్నపాటి వర్షానికే హైదరాబాద్‌లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్న నేపథ్యంలో.. హైడ్రా అప్రమత్తమైంది.ముందస్తు జాగ్రత్తలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ హైడ్రా సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. వర్షాకాలం అప్రమత్తంగా ఉండి.. నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా సిబ్బందికి సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా.. ఉన్నట్లుండి భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రజలకు వరద కష్టాలు లేకుండా జాగ్రత్త పడగలమని సూచించారు. శనివారం రోజున జలవిహార్‌లో మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లతో హైడ్రా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు.

# వీబీజీ రామ్‌జీ చట్టంపై కేంద్రానికి మంత్రి సీతక్క లేఖ

హైదరాబాద్, జూన్ 20, : వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నూతన చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడు వేర్వేరు లేఖలు కేంద్రానికి పంపించామని వెల్లడించారు. ఈరోజు (శనివారం) హైదరా బాద్ లోని సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌ను యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అధికారాలను బలహీనపరిచే నిబంధనలని వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు అన్యా యం చేస్తోందని పేర్కొన్నారు.పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలి..రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుము రంభీం, ఆసిఫాబాద్ వంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు విస్మరించొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని సూచించారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలని కోరారు.



గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలోలాగే 90 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే చిన్న రైతులకు నష్టమని చెప్పారు.జీవనోపాధి పనులను కొనసాగించాలి..ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయో గపడే జీవనోపాధి పనులను కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలకు అనుమతి ఇవ్వాలని కోరారు. 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామం గ్రామీణ పేదల ఆదాయాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతా లు, నీటి ఎద్దడి ప్రాంతాలకు 60 రోజుల నిషేధం నుంచి మినహా యింపు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మొక్కల పెంపకం, అటవీకరణ కార్యక్రమాలకు ఉపాధి విరామం వర్తింపజేయొద్దని అన్నారు. దళితులు, గిరిజనులు, భూమిలేని కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టంలో మార్పులు చేయాలని మంత్రి సీతక్క సూచించారు.

### సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో
# 1-డే కౌంట్‌డౌన్ ఈవెంట్

హైదరాబాద్, జూన్ 20: 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేకంగా 1-డే కౌంట్‌డౌన్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు రాంచందర్ రావు, ఎంపీలు లక్ష్మణ్, ఈటెల రాజేందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మా ట్లాడుతూ.. 12వ ప్రపంచ యోగా దినోత్సవం కౌంట్ డౌన్ కార్యక్రమానికి అందరికీ స్వాగతమని అన్నారు. రేపు(ఆదివారం) 200 దేశాలు అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో పాల్గొంటాయని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోల్‌క తాలో జరిగే యోగా వేడుకల్లో పాల్గొంటారని కిషన్ రెడ్డి




తెలిపారు. గత 12 ఏళ్లుగా కోల్‌కతాలో యోగా దినోత్సవ వేడుకలు జరగలేదన్నారు. యోగా డే సెలబ్రేషన్స్ కోసం నెల రోజులుగా అందరూ కలిసి ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. గత ఏడు సంవత్సరాలుగా యోగా వేడుకలకు 24 గంటల ముందు కౌంట్ డౌన్ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు.భారత్ అందించిన గొప్ప కానుక యోగా: వెంకయ్య నాయుడు రేపు యోగా ప్రపంచ వ్యాప్తంగా జరు గుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. యోగా ఒక మతానికి పరిమితం కాదన్నారు. యోగా చేస్తే సమ గ్ర మనిషిగా మారుతారని తెలిపారు. ప్రపంచానికి భారత్ అంది ంచిన గొప్ప కానుక యోగా అని చెప్పుకొచ్చారు. సర్వమానవ, సౌభ్రాతృత్వం, సర్వతోముఖాభివృద్ధికి యోగా అవసరమన్నారు. మానవ చైతన్యానికి నిదర్శనం యోగా అని పేర్కొన్నారు. పూర్వీ కులు రంగరించి మనకు అందించిన జీవన విధానం యోగా అని.. ఆరోగ్య, ఆధ్యాత్మిక, యోగా అని అన్నారు.

### ఘనంగా 'పశ్చిమబంగ దివస్' వేడుకలు..
### పాల్గొన్న ప్రధాని మోదీ



తారకేశ్వర్ (పశ్చిమ బెంగాల్), జూన్ 20: పశ్చిమ బెంగాల్ తారకేశ్వర్‌లో ఘనంగా నిర్వహించిన 'పశ్చిమబంగ దివస్' వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. రాష్ట్రంలో కొత్తగా బాధ్యతలు చేప ట్టిన ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి ప్రధాని ఈ వేడుకల్లో పాలుపం చుకు న్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ సమగ్ర వికాసం కోసం తమ ప్రభుత్వం అత్యంత వేగంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఈ చరిత్రాత్మక 'పశ్చిమబంగ దివస్' రాష్ట్రంలో సరికొత్త అభివృద్ధి విప్లవానికి స్ఫూర్తిగా నిలుస్తుందని తాను గట్టిగా నమ్ముతున్నానని ప్రధాని అన్నారు. బెంగాల్ అభివృద్ధి చెందితేనే దేశం మరింత ముందుకు దూసుకెళ్తుందని మోదీ పేర్కొన్నారు. కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా, పశ్చిమ బెంగాల్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రధాని మోదీ పలు రంగాలకు చెందిన ప్రాజెక్టులను ప్రారంభించారు.. శంకుస్థాపనలు చేశారు.ప్రయాణికుల సౌకర్యార్థం, చుట్టారు.

### "నేను జోక్ చేశాను.. బాస్‌లా అథారిటీ చూపించలేదు"
### : జీ7 వైరల్ కామెంట్‌పై ట్రంప్ సంచలన వివరణ



ఫ్రాన్స్ వేదికగా జరిగిన అంతర్జాతీయ జీ7 శిఖరాగ్ర సదస్సులో తీవ్ర సంచలనం సృష్టించిన తన 'ఐ యామ్ ది బాస్' వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు స్పష్టతని చ్చారు. ప్రపంచ దేశాల అధినేతలంతా కూర్చు న్న హాల్లోకి అడుగు పెడుతూ ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్య.. ప్రపంచవ్యాప్తంగా అమెరికా పెద్దరి కంపై పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. అయితే 'ది ఆక్సియోస్ షో' ఇంటర్వ్యూలో మాట్లాడిన ట్రంప్.. తాను అక్కడ ఎవరికీ బాస్‌లా ఆర్డర్లు వేయాలని అనుకోలేదని, కేవలం వాతావరణాన్ని తేలికపరచడానికి సరదాగా జోక్ చేశానని చెప్పుకొచ్చారు.అంతర్జాతీయ వేదికలపై తనదైన శైలి వ్యాఖ్యానిస్తూ.. ఎప్పుడూ వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా జీ7 సదస్సులోనూ సంచలన కామెంట్లు చేశారు. ముఖ్యంగా తనను తాను 'ఐ యామ్ ది బాస్' (నేనే బాస్‌ను) అని చెప్పుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. అందరూ దీనిపై స్పందించారు. ఇది సరైన పద్ధతి కాదని, జీ7 దేశాల సదస్సులో అందరి భాగస్వామ్యం ఒకేలా ఉంటుందని.. దీనికి ఎవరూ బాస్ కాదని రాసుకొచ్చారు. అయితే తాజాగా దీనిపై ట్రంప్ స్పందించారు. తాను బాస్‌లా అథారిటీ చూపించాలని ఆ కామెంట్ చేయలేదని.. కేవలం జోక్ మాత్రమే చేశానంటూ వివరించారు. తాను కేవలం సరదాగా అందరినీ నవ్వించడానికే ఆ మాట అన్నానని స్పష్టం చేశారు. ప్రముఖ అంతర్జాతీయ టాక్ షో 'ది ఆక్సియోస్ షో' ఇంటర్వ్యూలో ట్రంప్ పాల్గొని.. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన ఆ దౌత్యపరమైన క్షణాల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని వివరించారు.

### పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ
# నిధుల విడుదల

పల్నాడు జిల్లా, జూన్ 20, : పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ నిధులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లాలోని లింగంగుట్లలో ఈరోజు(శనివారం) విడుదల చేశారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రూ.3,125 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.7 వేలు జమ చేశామని పేర్కొన్నారు. బటన్ నొక్కగానే 99.8 శాతం రైతులకు నిధులు జమయ్యాయని తెలి పారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టు కున్నామని స్పష్టం చేశారు.జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారు..జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. విధ్వంసం నుంచి ఏపీని వికాసం వైపు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. సంపద సృష్టిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని వివరించారు.



2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామని తెలిపారు. మనం ఆర్థికంగా, ఆరోగ్యంగా బాగుండాలని ఆకాంక్షించారు. వైసీపీ హయాంలో రైతులకు అన్నీ కష్టాలే అని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉందని వ్యాఖ్యానించారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన.. 6 నెలలకు కూడా డబ్బులు వచ్చేవి కాదని అన్నారు. ఇప్పుడు 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని వివరించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా రైతుల అవసరాలను గుర్తిస్తున్నామని చెప్పుకొచ్చారు. అన్న దాతలు యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచిం చారు.ప్రకృతి సేద్యం వైపు ప్రపంచం చూస్తోంది..మళ్లీ ప్రకృతి సేద్యం వైపు ప్రపంచం చూస్తోందని సీఎం చంద్రబాబు తెలి పారు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. పామాయిల్ పంటలో అంతర్గత పంటలూ వేసుకోవచ్చని చెప్పారు. మనం ప్రకృతి సేద్యం వైపు మారాలని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు ద్వా రా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతామని అన్నారు. రాయల సీమ హార్టి కల్చర్ హబ్‌గా తయారైందని వివరించారు. పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. నదుల అనుసం ధానం తన జీవిత ఆశయమని ఉద్ఘాటించారు. నదుల అనుసం ధానం జరిగితే ఏపీకి తిరుగుండదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# పటాన్‌చెరు ఉద్యమ గళం: తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జూలై 2 'భూ పోరాటానికి' పిలుపు!





**అమీన్ పూర్, జూన్ 20 :(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్చార్జ్ తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో బీరంగూడ కమాన్ వద్ద గల కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన పత్రికా సమావేశం వాడీవేడిగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారుల సమస్యలపై తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జూలై 2న హైదరాబాద్ ఉప్పల్ బగాయత్ వేదికగా చేపట్టనున్న 'భూ పోరాటం' కార్యక్రమాన్ని ఆయన ప్రతిష్టాత్మకంగా ప్రకటించారు. తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు:"ఉద్యమకారుల త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణలో, వారికి అన్యాయం జరగడం దురదృష్టకరం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైంది. ఉద్యమకారుల సంక్షేమం కోసం 250 గజాల స్థలం, 25,000 రూపాయల పెన్షన్, మరి యు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి. కేకే కమిటీ పేరుతో ప్రభుత్వం కాలయాపన ఆపాలి. జూలై 2న నిర్వహించే సభ ద్వారా ప్రభుత్వానికి ఉద్యమకారుల సత్తా చూపిస్తాం," అని ఆయన హెచ్చరించారు పోరాటంలో ఐక్యత:ఈ భూ పోరాటంలో ఎటువంటి రాజకీయ విభేదాలు, కులమతాలకు తావులేకుండా ఉద్యమకారులందరూ ఒక్కతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. "మనం ఉన్నాం, మిమ్మల్ని కాపాడుకుంటాం" అనే అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితమ్మ గారి భరోసాను గుర్తు చేస్తూ, 24 నియోజకవర్గాల నుండి ఉద్యమకారులు స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ రామిగిరి ప్రకాష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రోగ్రాం ఇన్చార్జ్ దుగుంట్లకు నరేష్ ప్రజాపతి, జిల్లా ఇన్చార్జ్ మసన్నగారి బాలయ్య, ఉమ్మడి రంగారెడ్డి-మెదక్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, కన్వీనర్ మధుసూదన్, గౌరీ గణేష్, ఉమ్మడి మెదక్ ఇన్చార్జ్ వేముల భవాని, శివశంకర్, మడసు శ్రీనివాస్ రావు, గోపి సదానందం, రాంకోటి, అర్జున్, శ్రీనివాస్ రెడ్డి, భార్గవ్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, మరియు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రావి ఆకుపై 21 యోగాసనాల అద్భుత కళాఖండం






**సంగారెడ్డి, జూన్ 20 :(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ శివకుమార్ తన కళా ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. ఒకే రావి ఆకుపై 21 రకాల యోగాసనాలను కత్తిరింపు కళ (లీఫ్ కటింగ్ ఆర్ట్) ద్వారా అత్యంత నైపుణ్యంతో రూపొందించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కళాఖండాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. "ఒకే భూమి, ఒకే ఆరోగ్యం" అనే ఈ ఏడాది యోగా దినోత్సవ నినాదానికి అనుగుణంగా ఈ చిత్రాన్ని మలిచినట్లు చెప్పారు. యోగాపై మక్కువ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ అశ్వత్థ పత్రం (రావి ఆకు) కళాఖండాన్ని అంకితం చేస్తున్నానని పేర్కొంటూ, యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శివకుమార్ రూపొందించిన ఈ వినూత్న కళాఖండం స్థానికంగా అందరి ప్రశంసలను అందుకుంటోంది.

# బీరంగూడ గుట్టపై అయ్యప్ప స్వామి ఆలయంలో ఏకశిలా పదునెట్టాంబడి స్థాపన



**అమీన్ పూర్, జూన్ 20:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో 18 పవిత్ర మెట్ల (పదునెట్టాంబడి) నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణంలో భాగంగా వరంగల్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన భారీ ఏకశిలా రాయిని ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చి, రెండు భారీ క్రేన్ల సహాయంతో అత్యంత జాగ్రత్తగా పీఠంపై విజయవంతంగా స్థాపించారు. అయ్యప్ప స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచే పదునెట్టాంబడి నిర్మాణంలో ఏకశిలా రాయిని ఏర్పాటు చేయడం ఆలయ చరిత్రలో ఒక విశిష్ట ఘట్టంగా భక్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే, ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం బీరంగూడ గుట్ట ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడానికి అయ్యప్ప భక్తులు, దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొల్లూరి మల్లేష్, ఉపాధ్యక్షులు ఎడ్ల రాజు మల్లేష్, రవీందర్ రెడ్డి, అయ్యప్ప భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ







**అమీన్‌పూర్, జూన్ 20 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని చారిత్రాత్మక బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి దంపతులు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మంత్రి మరియు ఎంపీలకు ఆలయ ప్రాంగణంలో వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మంగళ వాయిద్యాలు, సనాయి మేళాల నడుమ ప్రత్యేక పూజల కోసం వారిని గరాభలయంలోకి ఆహ్వానించారు. మంత్రి, ఎంపీ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఘనంగా సత్కరించిన ఆలయ కమిటీ:పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణలతో పాటు వారి వెంట వచ్చిన పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ దంపతులను ఈవో దేవానందం మరియు ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అభివృద్ధిపై సమీక్ష:ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శశిధర్ రెడ్డి, శివానందం, ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్స్,ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఆలయ సిబ్బంది మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# టాస్ వేసి ఏపీఎల్ సీజన్ 2 ని ప్రారంభించిన కార్యదర్శి సునంద రాజ్




**చేగుంట జూన్ 20 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో బోయిని రాజ్ ఆధ్వర్యంలో శనివారం రోజున క్రికెట్ ప్రీమియం లీగ్ సిసేన్ 2 మ్యాచ్ నిర్వహించడం అనంతసాగర్ కార్యదర్శి టాస్ వేసి ఈ మ్యాచ్ ని ప్రారంభించాడం జరిగింది. ఈ సీజన్ 2 మ్యాచ్లో ఐదు జట్లు తలపడ్డయి మొదటి ఇన్నింగ్స్ లో పలువురు ఆటగాళ్లకు మేనేజ్ మ్యాచ్ బహుమతులను చౌడం వేణుగోపాల్ చిక్కుడు మహేష్ దివాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సునంద రాజ్, వార్డు సభ్యులు సదక్ పాషా, ఆర్.టి.ఐ జిల్లా కార్యదర్శి చిక్కుడు మహేష్,చౌడం వేణుగోపాల్,బోయిని నరేష్ టీం ఆర్గనైజర్ భువనగిరి నాగరాజు,బజరంగ్దళ్ సంయోజక్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాధాన్యత: రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో మంత్రి వివేక్ వెంకటస్వామి ఆకస్మిక తనిఖీ





**రామచంద్రాపురం, జూన్ 20(మెదక్ టుడే ) న్యూస్ ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై నేరుగా ఆరా తీశారు. తనిఖీల్లో భాగంగా వార్డులు, ఔట్‌పేషెంట్ విభాగం , మరియు మందుల పంపిణీ కేంద్రాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు మరియు ఆసుపత్రి నిర్వహణపై రోగుల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అనంతరం ఆసుపత్రి అధికారులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, వైద్యుల అందుబాటు, మందుల నిల్వలు మరియు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. "కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిపై కార్మికులు ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. రోగుల రద్దీకి అనుగుణంగా ఇక్కడ వైద్యులు, ఇతర వసతులను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అత్యాధునిక వైద్య సదుపాయాలు మరియు అవసరమైన అన్ని రకాల మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించాను. ఆసుపత్రి సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది," అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, స్థానిక అధికారులు, వైద్య సిబ్బంది మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పాఠశాలలను తనిఖీ చేసిన ఎంపీఓ



**చేగుంట జూన్ 20 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపీఓ ప్రకాష్ తనిఖీ చేశారు. అంగన్వాడి స్కూల్, ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. పాఠశాలలను వసతులను పరిశీలించి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీఓ ప్రకాష్ తోపాటు, ఎంపీడీవో ఆఫీస్ స్టాఫ్ విజయ్ కుమార్,గ్రామ సర్పంచ్ నరసింహులు పంచాయతీ కార్యదర్శి సుల్తానా, అంగన్వాడి టీచర్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# రీ నీట్- (యూజీ)-2026 పరీక్ష ప్రశాంత నిర్వహణకు అందరూ సహకరించాలి: ఎస్పీ. శ్రీనివాసరావు, ఐపీఎస్

**- పరీక్షా కేంద్రం పరిసరాల్లో సెక్షన్--163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు**




మెదక్,జూన్,20,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ నీట్ (యూజీ)–2026 పరీక్షను ఈ నెల 21వ తేదీ (ఆదివారం) మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు, పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.ఆదివారం ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భారతీయ నాగరిక సురక్షా సంహిత (బిఎన్ ఎస్ ఎస్) సెక్షన్--163 అమలులో ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పరీక్షా కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడడం నిషేధం అని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ సమయంలో పరీక్షా కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు కూడా మూసివేయబడతాయని చెప్పారు.అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి లేదా ముందుగానే చేరుకుని, హాల్ టికెట్, చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.పరీక్ష నిర్వహణ సిబ్బంది, పోలీసు అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.సెక్షన్--163 నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

# పెద్దమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొనఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



చేగుంట జూన్ 20 మెదక్ టుడే న్యూస్

నార్సింగి మండలం వల్లూరు గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న జాతర ఉత్సవాల్లో దుబ్బాక ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

**- ముగింపు దశలో కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు**
**- గతం కంటే వేగంగా రైతులకు చెల్లింపులు**
**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్,జూన్,20,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

రబి సీజన్ కు ధాన్యం సేకరణ రికార్డు స్థాయిలో కొనుగోలు జరుగుతుందని గత సీజన్ లో ఈ రోజుతో పోలిస్తే ఈ రబీ సీజన్లో ఈ రోజు వరకు 01 లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసి అతివేగంగా రైతుల ఎకౌంట్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో యాసంగి సీజన్ వద్ల సేకరణ కోసం మొత్తం 533 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, గతంలో కంటే కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో రైతులకు వేగంగా చెల్లింపులు జరిగాయనీ, తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు ముగింపుదశలో ఉన్నాయని జిల్లాలో అన్నీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించటం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,గత రబీ 2024–25సీజన్లో 3,20,000 మెట్రక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు వేగంగా చెల్లింపులు జరిగాయని తెలిపారు.2026 – 2027 సంవత్సరం రబీ సీజన్లో 20–6–2026 వ తేదీ నాటికి జిల్లాలో 4,18,244.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 892.62 కోట్ల రూపాయలు 86,130 రైతులకు మంది రైతులకు లబ్ధి చేకూరింది అన్నారు.గత సీజన్ తో పోలిస్తే ఈ రబీ సీజన్లో(01) లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని తెలిపారు.ధాన్యం కొనుగోలు ముగింపు దశలో ఉన్నాయని రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. కలెక్టర్ స్పష్టం చేశారు.

# విద్యార్థుల 'ఆత్మబంధువు' గూడెం మహిపాల్ రెడ్డి: 438 మంది ప్రతిభావంతులకు సైకిళ్ల పంపిణీ!








పటాన్‌చెరు, జూన్ 20, (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరో అడుగు ముందుకేశారు. నియోజకవర్గ చరిత్రలో తొలిసారిగా పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆయన తన సొంత నిధుల నుంచి 35 లక్షల రూపాయలు వెచ్చించి 438 మందికి సైకిళ్లను బహుమతిగా అందజేశారు.మైత్రి మైదానంలో ఘనంగా కార్యక్రమం:శనివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ స్వయంగా విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. 2025–26 విద్యా సంవత్సరంలో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలు మరియు 89 ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 438 మంది విద్యార్థులు ఈ సైకిళ్లను అందుకున్నారు.ఎమ్మెల్యే జిఎంఆర్ కీలక ప్రసంగం:ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ, “విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఉన్నత లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహం కలుగుతుంది. 10వ తరగతి జీవితాన్ని మలుపు తిప్పే కీలక దశ. ఇక్కడ సాధించే ఫలితాలే భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది అవుతాయి,” అని పేర్కొన్నారు. తాను ప్రతి ఏటా పరీక్షా సామాగ్రిని పంపిణీ చేయడంతో పాటు, మానసిక వికాస శిక్షణా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులకు అండగా ఉంటున్నానని ఆయన గుర్తు చేశారు.విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం:విద్యారంగ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ, విద్యార్థులకు ఆత్మబంధువుగా సేవలు అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి అడుగులోనూ నాన్న చూపిన మార్గమే..

మెదక్,జూన్,20,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

నా ప్రతి అడుగు, నా ఎదుగుదలలో మా నాన్న కొండల్రావు పాత్ర మరువలేనిది. పెద్దగా ఆర్థిక స్తోమత లేకపోయినా, విద్యే పిల్లలకు ఇవ్వగలిగే గొప్ప ఆస్తి అనే నమ్మకంతో ముగ్గురు పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివించి ఉన్నత స్థానాలకు చేర్చారు. నేడు మేము ముగ్గురం జీవితంలో స్థిరపడగలిగామంటే, అది ఆయన త్యాగం, కృషి, విలువలు, క్రమశిక్షణల ఫలితమే.నాన్న గణిత ఉపాధ్యాయుడు కావడంతో లెక్కల్లో ఎలాంటి సందేహం వచ్చినా ఎంతో ఓర్పుతో వివరించేవారు. గణితం మాత్రమే కాదు, జీవితంలో ఎలా ఆలోచించాలి, ఎలా ముందుకు సాగాలనే విషయాలను కూడా నేర్పించారు. ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా చిన్నప్పటి నుంచే బలమైన పునాది వేశారు.ఆయన నేర్పిన గణితమే నాకు ఉన్నత చదువుల్లోనూ, పోటీ పరీక్షల్లోనూ ఎంతో ఉపయోగపడింది. గ్రూప్స్ పరీక్షలో గణితంలో 150 మార్కులకు గాను 149 మార్కులు సాధించడం వెనుక ఆయన అందించిన శిక్షణే కారణం.పరీక్షలకు, ఇంటర్వ్యూలకు వెళ్లే ప్రతిసారీ నేను కంగారు పడేవాడిని. కానీ నాన్న మాత్రం ఎప్పుడూ నాలో ధైర్యాన్ని నింపేవారు.నువ్వు




కష్టపడ్డావు.విజయం తప్పకుండా నీదే అని చెప్పిన ఆయన మాటలు నాకు అపారమైన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చేవి. నేను గ్రూప్--1 అధికారిగా ఎంపికైన రోజు ఆయన ముఖంలో కనిపించిన ఆనందం, గర్వం నా జీవితంలో ఎప్పటికీ చెరిగిపోని జ్ఞాపకం.నేడు నేను వేసే ప్రతి అడుగులోనూ ఆయన చూపిన మార్గదర్శకత్వం, నేర్పిన విలువలు, క్రమశిక్షణే నాకు దిక్సూచిగా నిలిచాయి. నేను సాధించిన ప్రతి విజయంపై మొదటి హక్కు ఆయనదే.అయితే నా హృదయంలో ఎప్పటికీ తీరని ఒక బాధ ఉంది. నేను జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి ప్రజలకు సేవ చేస్తున్న దృశ్యాన్ని మా నాన్న తన కళ్లారా చూడలేకపోయారు. తన కొడుకు జిల్లా ఎస్పీ అయ్యాడనే గర్వంతో ఆయన చిరునవ్వును మరోసారి చూడలేకపోయాను. ఆ ఆనందాన్ని ఆయనతో పంచుకోలేకపోయాననే లోటు నన్ను ఇప్పటికీ కలిచివేస్తూనే ఉంటుంది.ఆయన భౌతికంగా నాతో లేకపోయినా, ఆయన ఆశీస్సులు నా వెన్నంటే ఉన్నాయి.ఆయన నేర్పిన విలువలు నా ప్రతి నిర్ణయంలో కనిపిస్తాయి. నేను వేసే ప్రతి మంచి అడుగు, నేను సాధించే ప్రతి విజయం.అన్నీ మా నాన్నకు అంకితమే.

**--- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్**

# సమస్యలుంటే సంకోచించవద్దు.నేరుగా తెలియజేయండి

**- యూనిఫామ్‌కు గౌరవం తీసుకొచ్చేలా విధులు నిర్వహించాలి**
**- పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, సంక్షేమంపై అదనపు ఎస్పీ ప్రత్యేక సూచనలు**





మెదక్,జూన్,20,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

పరేడ్ ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, ఐక్యత పెంపొందుతుంది: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం వారాంత పరేడ్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో హైరార్కీ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, అధికారులు ఇచ్చే ఆదేశాలను ప్రతి పోలీసు సిబ్బంది విధిగా పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో కొన్నిసార్లు 10 నుంచి 12 గంటలపాటు పనిచేయాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితులను సమర్థంగాఎదుర్కొనేందుకు పరేడ్ ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు క్రమశిక్షణఅలవడుతుందన్నారు.యూనిఫామ్ అంటే కేవలం దుస్తులు మాత్రమే కాదని, అది పోలీసు శాఖలోని యూనిఫార్మిటీ, క్రమశిక్షణ, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది యూనిఫామ్‌కు ఉన్న గౌరవాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మహిపాల్ మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, ఆయన లేని లోటును వారి కుటుంబానికి ఎవరూ భర్తీ చేయలేరన్నారు. ఇలాంటి అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రతి పోలీసు ఉద్యోగి శాలరీ ప్యాకేజీ సౌకర్యం కలిగిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండేలా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా హోంగార్డు సిబ్బంది కూడా హెచ్‌డీఎఫ్‌సీ (హెచ్ డి ఎఫ్ సి), యాక్సిస్ (ఏ ఎక్స్ ఐ ఎస్) బ్యాంకులు అందిస్తున్న శాలరీ ప్యాకేజీల్లో తమ ఖాతాలను మార్చుకోవాలని సూచించారు.ఈ ప్యాకేజీల ద్వారా లభించే ప్రమాద బీమా వంటి ప్రయోజనాలు అనుకోని ప్రమాదాల సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక ఆసరాగా నిలుస్తాయని తెలిపారు.అదనపు ఎస్పీ పోలీసు సిబ్బందికి ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.ఆన్‌లైన్ బెట్టింగ్‌లో మొదట కొంత లాభం వచ్చినట్లు చూపించి ఆకర్షిస్తారని, అనంతరం భారీ మొత్తంలో ఆర్థిక నష్టాలు ఎదురై తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని హెచ్చరించారు.ఇలాంటి పరిస్థితుల కారణంగా కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య వంటి దురదృష్టకర నిర్ణయాలకు కూడా పాల్పడే పరిస్థితులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండి, బాధ్యతాయుతమైన ఆర్థిక క్రమశిక్షణను పాటించాలని సూచించారు.అలాగే, విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగతంగా గానీ ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి నేరుగా తెలియజేయాలని అదనపు ఎస్పీ సూచించారు. సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరేడ్‌లో డియస్పి ప్రసన్న కుమార్, ఆర్ఐ లు శైలందర్, రామకృష్ణ,ఎస్సై లు సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగావ్యవహరించాలి


- పోలీస్ కళాబృందాలతో ప్రత్యేక అవగాహన సదస్సు
- సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాలు,
- బాల్య వివాహాల నివారణపై ప్రజలకు చైతన్యం
- మెదక్ రూరల్‌సీఐకృష్ణమూర్తి






**పాపన్నపేట,జూన్,20,(మెదక్ టుడే న్యూస్)** ప్రజల్లో సామాజిక బాధ్యతతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ కళాబృందాల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించినట్లు మెదక్ రూరల్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం రాత్రి మండల పరిదిలోని గాంధిరిపల్లిలో మేలు కోలుపు పోలీసు కళా బృందం ద్వార సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వినియోగం, బాల్య వివాహాల వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమనిఆయనపేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దనిహెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ఆర్థిక నష్టాలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ఆయన, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. మత్తు పదార్థాల బారిన పడకుండా యువత తమ భవిష్యత్తుపైదృష్టి సారించాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని స్పష్టం చేసిన ఆయన, బాలికల విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడవచ్చున్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల్లోచైతన్యంపెంపొందించేందుకు పోలీస్ కళాబృందాల సభ్యులు పాటలు, నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా సామాజిక సందేశాలను అందించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలోపాపన్నపేటఎస్ ఐ శ్రీనివాస్గౌడ్,పోలీస్ సిబ్బంది, కళాబృందాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థికసాయం .. అందజేత




**పాపన్నపేట,జూన్,20,మెదక్ టుడే న్యూస్:** అర్కెల గ్రామానికి చెందిన పెద్ది బాలమణి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించింది. భారాస మెదక్ నియోజకవర్గ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి పార్టీ శ్రేణుల ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5 వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. అర్కెల గ్రామ పార్టీ నాయకులు,గ్రామస్తులు రూ. 5 వేలు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మొత్తం రూ. 10 వేల ఆర్థిక సాయం కుటుంబానికి అందింది. ఈసందర్భంగా కుమ్మరి బసవరాజ్, హరికాంత్,కృష్ణ,కుమ్మరి రాములు,ముచ్చ రామలింగం,ఎల్లంపల్లి రవి,కుమ్మరి అంజి,యాదయ్య,ఎల్లపంల్లి మల్లేశం తదితరులు ఉన్నారు.

## నీట మునిగి వ్యక్తి మృతి...

**పాపన్నపేట,జూన్,20,మెదక్ టుడే న్యూస్:** ప్రమాదవశాత్తూ చెరువులో నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా. యూసుఫ్ పేట గ్రామానికి చెందిన నర్ర రాములు(48) వ్యవసాయంతో పాటు చేపలు పడుతూ జీవితం గడుపుతున్నాడు. ఈనెల 18న చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి వలలు తీసుకొని ఇంటి నుంచి గ్రామంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు చుట్టూ పక్కల గాలించారు. శుక్రవారం చెరువు కట్ట మీద అతని బట్టలు, చెప్పులు, ఫోన్ కనిపించడంతో గజఈత గాళ్ళతో గాలించగా రాత్రి సమయంలో మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



# ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రా డిజాస్టర్ కోసం కాదు

**హైదరాబాద్, జూన్ 20, :** హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్ష పదివేల కోట్ల ఆస్తులు కాపాడమని వివరించారు. (శనివారం) హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్నాం..ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగానాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు.



గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా లేదా పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుంది.. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు.

## నరహరి బ్యాంకు లాకర్లలోని రూ.1.50 కోట్ల నగదు, 2.5 కిలోల బంగారం స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 20, :** ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు సహకరించకపోవడంతో, న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది. ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో





రూ. 1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో దొరికిన నగదు, బంగారానికి సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, పన్ను వివరాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది.

# టీజీ-20 లీగ్‌ను హెచ్‌సీఏ అక్రమంగా నిర్వహిస్తోంది

**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి మరోసారి సీఐడీకి ఫిర్యాదు చేశారు. టీజీ–20 లీగ్ కోసం హెచ్‌సీఏ ఏర్పాటు చేసిన బ్యాంక్ అకౌంట్లను వెంటనే నిలిపివేయాలని సీఐడీని ఆయన కోరారు. ఫిర్యాదు అనంతరం గురువారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీఏ నిర్వహిస్తున్న టీజీ–20 లీగ్‌కు అనుమతి లేదని, వెంటనే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీజీ–20 లీగ్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమంగా నిర్వహిస్తోందన్నారు. ఈ లీగ్‌కు హెచ్‌సీఏ జనరల్ బాడీ ఆమోదం లేదని, జనరల్ బాడీ ద్వారా ఎన్నుకున్న చైర్మన్ కూడా లేరని గురువారెడ్డి ఆరోపించారు. అలాగే ఈ లీగ్ కోసం హెచ్‌సీఏ తెరిచిన బ్యాంక్ ఖాతాను నిర్వహించడానికీ అనుమతులు లేవన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పబ్లిక్ అకౌంటబిలిటీ సంస్థ అని, కానీ బైలాస్, రూల్స్‌కు విరుద్ధంగా నిర్వాహకులు నడుచుకుంటున్నారని మండిపడ్డారు. టీజీ–20 లీగ్ ఆటగాళ్ల ఎంపికలోనూ బీసీసీఐ, ఐపీఎల్ నిబంధనలు పాటించలేదని గురువారెడ్డి విమర్శించారు. టీసీఏతో కలిసి లీగ్‌లను నిర్వహించాలని కోర్టు ఆదేశాలు ఉన్నా హెచ్‌సీఏ పట్టించుకో




వడం లేదని ధ్వజమెత్తారు. కార్పొరేట్ కంపెనీలను ఇన్‌వాల్వ్ చేసి తెలంగాణ జిల్లాల పేరుతో హెచ్‌సీఏ లబ్ధి పొందాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బ్యాంక్ ఖాతాలను వెంటనే ఫ్రీజ్ చేయాలని గురువారెడ్డి డిమాండ్ చేశారు. రూ.46 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు అంచనా మొత్తంతో బ్యాంక్ ఖాతా ఉందని, దాన్ని వెంటనే ఫ్రీజ్ చేయాలని సీఐడీని కోరినట్లు తెలిపారు. రూ.50 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగే అవకాశం ఉందని, అందుకే అకౌంట్‌ను నిలిపివేయాలని సీఐడీని కోరినట్లు పేర్కొన్నారు. మరోవైపు హెచ్‌సీఏలోని అపెక్స్, ప్రభుత్వ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐడీకి విజ్ఞప్తి చేసినట్లు టీసీఏ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి తెలిపారు.

# ప్రాజెక్టులపై కేసులు వేసి అడ్డుకున్నది కాంగ్రెస్ నాయకులే

**జడ్చర్ల :** బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టుల పై నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ అడుగడుగునా అడ్డుకుందని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం అంబేద్కర్ కళా భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జిల్లా ప్రజలకు వరంలాంటిదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేపట్టిన మొట్టమొదటి ఇరిగేషన్ ప్రాజెక్టు అని గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణకు కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి అడ్డుకున్నారని ఆరోపించారు. భూసేకరణ విషయంలో కూడా కేవలం కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి ప్రాజెక్టు పనులు ముందుకు సాగనివ్వలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్దండాపూర్ ప్రాజెక్టును మొత్తం మూడు ప్యాకేజీలుగా పనులు చేపట్టామని వివరించారు. రైతులకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చేందుకు ఉద్దండాపూర్ పనులు ఆలస్యంగా ప్రారంభించామని వెల్లడించారు. దాదపు ఐదు వేల కోట్లు ఉద్దండపూర్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని, గడిచిన రెండున్నర కాంగ్రెస్ పాలనలో ఐదు వందల కోట్లు మాత్రమే రిలీజ్ చేశారని ఆరోపించారు. రైతులకు ఎకరానికి రూ.11 లక్షల నుంచి 16 లక్షల ముప్పై వేలకు పరిహారం కింద అందజేశామని వివరించారు. ఎన్నికల్లో రూ. 25 లక్షలకు ప్యాకేజీ



పెంచుతామని కాంగ్రెస్ మాట ఇచ్చి, ఒక్క రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్ కోసం అందరినీ ఒప్పించి మూడు వందల ఎకరాలు సేకరించామని వెల్లడిం చారు. భూ నిర్వాసితులకు అడుగడుగునా అండగా ఉన్నామని తెలిపారు. ఉద్దండపూర్ విషయంలో రెండున్నర ఏండ్లు రాజకీయం చేయలేదని, నిర్వాసితులు బాగుపడటమే తమ పార్టీ ధ్యేయమని స్పష్టం చేశారు. తెలంగాణ రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం 70 లక్షల మంది రైతులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేయగా, ప్రస్తుతం రైతులను సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతే కేంద్రబిందువుగా పాలన సాగిందని.. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలతో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో నేరుగా లక్ష కోట్లకుపైగా జమ చేసి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎన్నికల సమయంలో అన్ని పంటలను చివరి గింజ సమయంలో అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేయడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. పంటల కొనుగోళ్ల విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను దళారుల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తోందని ఆరోపించారు. గతంలో కేంద్రం కొనుగోలు చేయని పంటలను కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్రం కోటా మేరకే కొనుగోలు చేస్తామనడం అత్యంత బాధాకరమని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదని చెప్పారు. తెలంగాణ రైతులు పండించే ప్రతీ పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..